క్లుప్తంగా

నాణ్యత ప్రమాణాలను పాటించాలి



పరిశీలిస్తున్న హరిత

నెల్లూరు సిటీ: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. వెంకటేశ్వరపురంలోని జగనన్న కాలనీని శనివారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. నిర్దేశించిన అభివృద్ధి పనులను అమెనిటీస్ కార్యదర్శులు పర్యవేక్షించాలని కోరారు. కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్, తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

కొడవలూరు : టైరు పంక్చర్ కావడంతో ఆర్టీసీ బస్సు వరి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన మండలంలోని బసవాయపాళెం వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై జి.సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు.. బోగోలు మండలం చెన్నారాయుని పాళెం నుంచి అల్లూరు మీదుగా నెల్లూరు వెళ్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు కొడవలూరు మండలం బసవాయపాళెం వద్దకు రాగానే, ముందు టైరు పంక్చరైంది. దీంతో బస్సు అదుపుతప్పి వరి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సులో 75 మంది ప్రయాణికులు ఉన్నారు. అదుపు తప్పిన బస్సు పొలాల్లోకి వెళ్లినప్పటికీ బోల్తా పడకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులంతా సురక్షితంగా బయట పడ్డారు. వారిని మరో ఆర్టీసీ బస్సులో ఎక్కించి పంపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

మనుబోలు : మండల పరిధిలోని కండలేరు కాలువ నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను నెల్లూరు టూ టౌన్ సెబ్ సీఐ వెంకటేశ్వరరావు స్వాధీనం చేసుకున్నారు. మనుబోలు పరిధిలో జాతీయ రహదారిపై శనివారం తనిఖీలు చేస్తుండగా, ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను నిలిపి పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను మనుబోలు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

ఆక్రమణలను వెంటనే తొలగించాలి



బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : మండలంలోని రామతీర్థంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని దళిత సంఘాల నేతలు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దళిత నేతలు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని దుకాణాలను నిర్మించుకున్నారని తెలిపారు. దీనిపై ఇప్పటికే దుకాణదారులకు ఆక్రమణలను తొలగించాలని కోరినా ఫలితం లేకపోవడంతో ఆందోళన చేపట్టామన్నారు. దీంతో బుచ్చిరెడ్డిపాళెం సీఐ రాంబాబు, విడవలూరు ఎస్సై అంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపారు. కార్యక్రమంలో దళిత నేతలు ఎల్లు సాల్మన్‌రాజు, పొంగులూరు ప్రసాద్, ముసలి నరేంద్ర, దానం మాత్యాద్రి, సుధాకర్, కిరణ్‌కుమార్, విజయ్‌కుమార్, ఇజ్రాయేల్ పాల్గొన్నారు.

వార్షిక వేడుకలు ప్రారంభం



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని దుర్గానగర్‌లో కొలువైన కనకదుర్గా అమ్మవారి ఆలయ పదో వార్షికోత్సవ వేడుకలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు 14వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా తొలిరోజు శనివారం మహిళా భక్తులు 108 కలశాలతో పవిత్ర జలాలను తీసుకుని ఉత్సవంగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న లక్ష్మీ గోదాదేవి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం తిరిగి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ పోటీలను సౌత్‌మోపూరు జెడ్పీ హైస్కూల్లో శనివారం ప్రారంభించారు. క్రీడా జ్యోతిని వెలిగించిన అనంతరం ఆయన మాట్లాడారు. క్రీడలకు తన వంతు ప్రోత్సాహాన్ని అందిస్తానని చెప్పారు. విద్యార్థిగా ఉన్న సమయంలో జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్నానని గుర్తుచేసుకున్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ మాట్లాడారు. క్రీడల్లో విద్యార్థులు రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు పాఠశాలల జట్లు వివిధ క్రీడాంశాల్లో ఉత్సాహంగా తలపడ్డాయి.

సచివాలయంలో పరిశీలన

సౌత్‌మోపూరులోని గ్రామ సచివాలయాన్ని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ సందర్శించారు. సిబ్బంది, వలంటీర్లతో మాట్లాడి అర్హులకు ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును ఆరాతీశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ప్రభాకర్‌రెడ్డి, మత్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, నరసింహకొండ దేవస్థాన చైర్మన్ సురేంద్రరెడ్డి, మాజీ కార్పొరేటర్ వెంకయ్య, కార్పొరేటర్ అవినాష్, మల్లికార్జున్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సంఘటితంగా సాగాలి



మాట్లాడుతున్న ఎలీషాకుమార్

నెల్లూరు(బృందావనం): క్రైస్తవులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు గానూ సంఘటితంగా ముందుకు సాగాలని తెలుగు క్యాథలిక్ బిషప్స్ కౌన్సిల్, తెలుగు రాష్ట్రాల ఎస్సీ, బీసీ కమిషన్ కార్యదర్శి ఎలీషాకుమార్ పేర్కొన్నారు. నగర పరిధిలోని క్రైస్తవ నేతలు, దైవసేవకులతో క్రైస్తవ ఆత్మీయ సమావేశాన్ని మిలటరీ కాలనీలోని ఆదరణ మినిస్ట్రీస్ చర్చిలో జిల్లా పీస్ కమిటీ సభ్యుడు హృదయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలీషాకుమార్ మాట్లాడారు. క్రైస్తవులకు సంక్రమించిన ప్రాథమిక హక్కులను సాధించుకోవడంలో పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాను సాధించేంత వరకు పోరాటం చేయాలని పేర్కొన్నారు. అనంతరం హృదయ్‌కుమార్ మాట్లాడారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో క్రైస్తవ ఆత్మీయ సమావేశాలను త్వరలో నిర్వహించి హక్కుల కోసం ఐక్యంగా పోరాటం చేస్తామన్నారు. సురేష్, రెవరెండ్ జోసఫ్‌బాబు, ఎజ్రా, అడ్వొకేట్ దైవాదీనం, దినకర్, మోజెస్, పాస్టర్ అబ్రహాం, బాబు, రవిరాజేంద్ర, సంజయ్‌కుమార్, కాలేబు, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(సెంట్రల్): ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శనివారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు బీజేవైఎం చేయూతనందిస్తోందని ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పేర్కొన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల ముగింపు, బహుమతి ప్రదానోత్సవాన్ని శనివారం జరిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి నెలా క్రీడా పోటీలను నిర్వహించనున్నారని వివరించారు. అనంతరం విజేతలైన ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, జెనెక్స్ కాలేజీ జట్లకు జ్ఞాపికలు, రూ.82 వేల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘునందన్, విజయలక్ష్మి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ యతిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ ఎన్నికల అధికారిగా సుధాకర్‌రెడ్డి



నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘ ఎన్నికలను హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సంఘ కోశాధికారి రామ్‌ప్రసాద్ మాట్లాడారు. కోవూరు తాలూకా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఆత్మకూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఖాదర్‌బాషా ఎన్నికల అధికారులుగా వ్యవహరించనున్నారని చెప్పారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళి



నెల్లూరు(బారకాసు): తుది శ్వాస వరకు దేశం కోసం పరితపించిన మహోన్నత వ్యక్తి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. దీన్‌దయాళ్ వర్ధంతిని పురస్కరించుకొని నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నేతలు రఘునాథరాజు, గిరికుమార్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, చైతన్య, రఘురామయ్య, సత్యనారాయణ, ఆదినారాయణ, వీరాస్వామి, సురేష్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దర్గామిట్ట ఎస్సై బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైమ్): దర్గామిట్ట ఎస్సైగా వెంకటాద్రినాయుడు బాధ్యతలను శనివారం స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆర్చరీ జిల్లా జట్ల ఎంపికలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో విలువిద్య పోటీలు, ఎంపికలను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి వేణు మాట్లాడారు. మహిళల ఇండియన్ రౌండ్‌లో హర్షిణి, లక్ష్మీప్రశాంతి, మౌనిక, తనూష, పురుషుల ఇండియన్ రౌండ్‌లో మనోజ్‌కుమార్, వెంకటలోకేష్, భాగ్యరాజ్, పురుషుల రికర్వ్ రౌండ్‌లో తరుణీష్ జైత్య, సాయిమౌర్య, శ్రీనాథ్, నూతన్, రాజశేఖర్, శ్రీనివాస్ ఎంపికయ్యారని వివరించారు. విజయవాడలో ఈ నెల 28 నుంచి నిర్వహించనున్న అంతర్ జిల్లాల ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారని చెప్పారు. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీహర్ష, తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ



నెల్లూరు(అర్బన్): పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గల నిరాశ్రయుల కేంద్రంలో ఆహార పొట్లాలను పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. నాగేశ్వరమ్మ నాలుగో వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, డివిజన్ కార్యదర్శి శ్రీనివాసులు, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, బాలమ్మ, రాకేష్, నాగార్జున, కవిత, సహనశ్రీ, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్స్ కాలనీలో రక్తదాన శిబిరం



నెల్లూరు(అర్బన్): రక్తదానం ప్రాణదానంతో సమానమని వరపరివార్ సేవా ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవి పేర్కొన్నారు. ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అయ్యప్పగుడి సమీపంలోని డ్రైవర్స్ కాలనీలో రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. రక్తాన్ని నోవా బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్లు సేకరించారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్ రాజు, సృజన సాంస్కృతిక వేదిక నేత రాధాకృష్ణ, ప్యూర్ స్మైల్స్ సేవా ఫౌండేషన్ అధ్యక్షురాలు పర్వీన్, విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు సువర్ణకుమారి, హ్యాండ్స్ ఆన్ ఫౌండేషన్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



నెల్లూరు(అర్బన్): ఇండియన్ రెడ్‌క్రాస్ తలసేమియా కేర్ సెంటర్ కో కన్వీనర్‌గా సేవలందిస్తున్న పర్వీన్‌ను మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ కేంద్రంలో శనివారం సన్మానించారు. స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ జాతీయ స్థాయి అవార్డును ఆమెకు హైదరాబాద్‌లోని భారత్ వికాస్ పరిషత్ – విశ్వగురు వరల్డ్ రికార్డ్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల అందజేశారు. ఈ క్రమంలో ఆమెను సన్మానించారు. ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపల్ గురునాథం, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఏపీ చాప్టర్ రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న పవన్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): మారిన జీవనశైలి, కలుషితమైన ఆహారం, నీరు, గాలితోనే గ్యాస్ట్రయిటిస్ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ గాస్ట్రో ఎంట్రాలజీ స్పెషలిస్ట్ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఏపీ చాప్టర్ రాష్ట్ర మహాసభలను నగరంలోని మినర్వా గ్రాండ్ సమావేశ మందిరంలో నెల్లూరు గట్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. నిద్రలేమి, జంక్‌ఫుడ్స్, ఒత్తిడితో ప్రస్తుతం 95 శాతం మంది ఉదర కోశ, గ్యాస్ట్రయిటిస్, జీర్ణ కోశ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నారని చెప్పారు. వీటిని నివారించేందుకు గానూ జీవన విధానాన్ని మార్చుకోవాలని కోరారు. అనంతరం గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. మద్యం, ధూమపానం, శీతల పానీయాలు లాంటి అలవాట్లను మానుకోవాలని కోరారు. వైద్యుల సలహాలను పాటించి పౌష్టికాహారంతో పాటు మంచి ఆహార అలవాట్లతో వ్యాధిని నివారించుకోవచ్చని చెప్పారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ స్పెషలిస్ట్‌లు జానకిరామ్, పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్, మహేష్, శ్రీధర్‌రెడ్డి, చంద్రకాంత్, హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలకు కళా నీరాజనం



రమాదేవి, కాలేషాకు సత్కారం

నెల్లూరు(బృందావనం): పద్మశ్రీ ఘంటసాల వర్ధంతిని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ఏపీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పాటలు, డ్యాన్స్ పోటీలను నిర్వాహకుడు సుబ్బారావు పర్యవేక్షణలో జరిపారు. విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. ఘంటసాల పాటలను గాయకులు మధుసూదన్, షఫీ, రామచంద్రరావు, ఝాన్సీ, తదితరులు ఆలపించారు. సంగీత విభావరిని బాలాజీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు కాలేషా, అడ్వొకేట్ రమాదేవిని సత్కరించారు. జయప్రకాష్, రాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

కేపీసీ కళాశాల పీడీగా వేణుగోపాల్‌రెడ్డి



నెల్లూరు (టౌన్): స్టోన్‌హౌస్‌పేటలోని కేపీసీ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌గా వేణుగోపాల్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు ఇంటర్ విద్య కమిషనర్ శేషగిరిబాబు ఉత్తర్వులను జారీ చేశారు. నగరంలోని వేణుగోపాలస్వామి జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఈయన పనిచేశారు. ఎయిడెడ్ కళాశాల కావడంతో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని ప్రభుత్వంలోకి విలీనం చేశారు. ఈయనతో పాటు అధ్యాపకేతర సిబ్బంది రవిచంద్రన్, సుజాతమ్మ కేపీసీ కళాశాలలో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గురవయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మాట్లాడుతున్న రవీంద్రబాబు

నెల్లూరు (టౌన్): నగరంలోని వీఆర్ డిగ్రీ కళాశాలలో 1974 – 77 మధ్య బీకాం చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని డీఆర్ ఉత్తమ హోటల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ ప్రిన్సిపల్ రవీంద్రబాబు మాట్లాడారు. వీఆర్ విద్యాసంస్థల్లో చదివిన ఎంతో మంది వివిధ హోదాల్లో ఉన్నారని చెప్పారు. వీఆర్ విద్యా సంస్థలకు పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు యత్నించాలని కోరారు. అనంతరం పూర్వ ప్రిన్సిపల్స్ రామచంద్రారెడ్డి, బాబర్ అహ్మద్ అలీ, భవానీ శంకర్, అధ్యాపకుడు ప్రసాద్, ప్రస్తుత ఇన్‌చార్జి ప్రిన్సిపల్ తనూజను అలుమ్ని ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పూర్వ విద్యార్థులు జనార్దన్, హనుమంతరావు, జగదీష్, రమేష్, విష్ణుమోహన్, ఖాజా, ఖాదర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో లుకలుకలు

• ఇద్దరిపై దౌర్జన్యం

నెల్లూరు(క్రైమ్): జనసేనలో వర్గ విభేదాలు బట్టబయలయ్యాయి. ఓ వర్గం మరో వర్గంపై దౌర్జన్యం చేసిన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసును శనివారం నమోదు చేశారు. వివరాలు.. జనసేన నేత కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి నెల్లూరు నగర నియోజకవర్గంలో పవనన్న ప్రజాబాట, ప్రచార కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వీరి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. వెంకటేశ్వరపురంలో ప్రచార కార్యక్రమాన్ని మనుక్రాంత్‌రెడ్డి శుక్రవారం నిర్వహించారు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన వినోద్‌రెడ్డి వర్గీయులు హేమంత్, జాఫర్, వరప్రసాద్, జీవన్, దివాకర్.. మనుక్రాంత్‌రెడ్డి వర్గానికి చెందిన వినయ్‌కుమార్‌ను అడ్డుకున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని వారు ఇక్కడ ప్రచారం చేయడమేమిటని దౌర్జన్యం చేసి దాడికి పాల్పడ్డారు. అడ్డుపోయిన పార్టీ మహిళా నేత అలీయాను దుర్భాషలాడారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు తెలిపారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



పూడికతీత పనులను పరిశీలిస్తున్న వెంకటరమణ

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో దోమల నివారణకు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ నెలాఖరు నాటికి అన్ని డివిజన్లలో ఫాగింగ్, కాలువల్లో పూడికతీత, స్ప్రేయింగ్, ఆయిల్ బాల్స్ వేసే ప్రక్రియను పూర్తి చేయాలని కమిషనర్ హరిత ఆదేశించారు. ఈ క్రమంలో పనులను శనివారం పరిశీలించిన అనంతరం వెంకటరమణ మాట్లాడారు. 100 మందితో పది బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అన్ని డివిజన్లలో ఫాగింగ్, స్ప్రేయింగ్, ఆయిల్ బాల్స్‌ను వేస్తామని పేర్కొన్నారు.

ఇంట్లోకి అక్రమంగా ప్రవేశం

నెల్లూరు(క్రైమ్): న్యూ మిలటరీ కాలనీలో కోర్టు అనుమతితో బ్యాంక్ సీజ్ చేసిన ఇంటి తాళాలను పగలగొట్టిన వ్యక్తులపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. సదరు ఇంట్లోకి ఈ నెల ఎనిమిదో తేదీన లక్ష్మీనారాయణరెడ్డి, అవినాష్‌రెడ్డి, శ్యామల, విజయలక్ష్మి అక్రమంగా ప్రవేశించారు. ఘటనపై కర్ణాటక బ్యాంక్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సుబ్రహ్మణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

పరస్పర కేసులు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఇరువర్గాలపై బాలాజీనగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బాలాజీనగర్ గీతాంజలి స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న సుమ అలియాస్ శంకరమ్మ, సుధమ్మ మధ్య పాడుపు లోన్ల విషయంలో విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. వీరిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

కులం పేరుతో దూషణ

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిని కులం పేరుతో దూషించి దాడి చేసిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసును నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం కోడూరుపాడుకు చెందిన వెంకటేశ్వర్లు మాగుంట లేఅవుట్లోని లెక్చరర్స్ కాలనీలో నివాసం ఉంటున్న కమలాకర్‌రెడ్డి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. యజమాని ఇంట్లో పనులు ముగించుకున్న అనంతరం వెంకటేశ్వర్లు తన సహచరులైన మహేష్‌బాబు, ఉపేంద్రతో కలిసి ఎంజీబీ మాల్‌కు శుక్రవారం బయల్దేరారు. మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి యజమాని స్నేహితుడైన వేణుగోపాల్‌రెడ్డి తారసపడ్డారు. తమ యజమానిపై తప్పుడు కేసు పెట్టావు అని వెంకటేశ్వర్లు అడిగారు. దీంతో ఆయన్ను కులంపేరుతో వేణుగోపాల్‌రెడ్డి దూషించి దాడి చేశారు. అడ్డుపోయిన మహేష్‌బాబు, ఉపేంద్రపై సైతం దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు.